
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 142 వ భాగం

## సూర్య వంశం – 10, ఖట్వాంగుడు

ఇక్ష్వాకు వంశం అంతరించే స్థితిలో ఓ రాజుని ఇంట్లో నారీజనం రక్షించారు అప్పటికి రాజులని నిర్మూలించే పనిలో ఉన్న పరశురాముడి బారిన పడకుండా. వంశానికి అలా మూలస్థంభంగా మారాడు కనక మూలకుడనీ, నారీజనం వల్ల రక్షించబడ్డాడు కనక నారీకవచుడనీ పేరు ఆయనకి. నారీకవచుడి కొడుకు విశ్వసహుడు, ఆయన పుత్రుడు ఖట్వాంగుడు. ఆయన చక్రవర్తి అయ్యాడు మూలకుడి తర్వాత.

సీ. అమరులు వేఁడిన నసురనాథులఁ జంపి
త్రిదశులతోఁ దన బ్రతుకుకాల
మెంతని యడిగిన నిదె నిండుచున్నది
తడవులే దేమైన నడుగు మనిన
వరములు గోరక వరవిమానం బెక్కి
తనపురికేతెంచి తత్త్వబుద్ధిఁ
బరమేశ్వరుని యంద భావంబుఁ గీలించి
కులదైవతద్విజకులముకంటె [9-254]

తే. నంగనా ప్రాణ రాజ్య పుత్రాదు లెల్ల
గావు ప్రియములు ధర్మంబు గడచి నాదు
మతి ప్రవర్తింప దెన్నఁడు మది నెఱుంగ
నన్య మా యీశ్వరునిఁ దక్క ననుచు మఱియు. [9-254.1]

దేవతలు కోరితే వెళ్ళి దేవదానవ యుద్ధంలో రాక్షస రాజులను సంహరించాక, వాళ్ళని ‘తన జీవితకాలం ఇంకా ఎంత ఉంది’ అని అడిగాడు. ఎంతో లేదు ఇదిగో పూర్తయిపోతోంది, ఏదైనా వరం కోరుకో అన్నారు వాళ్ళు. ఖట్వాంగుడు వరాలు ఏమీ అఖ్ఖర్లేదని చెప్పి తన రాజ్యానికి వచ్చాడు. మనసు భగవంతుని మీదే లగ్నం చేసి భార్యా పుత్రులు, ప్రాణాలు, రాజ్యాధికారం ఇవన్నీ ఏవీ కూడ కూడా నాతో వచ్చేవి కావు. నా బుద్ధి ఎప్పుడూ ధర్మాన్ని అతిక్రమించి నడవ(కూడ)దు. భగవంతుని గురించి తప్పించి ఇతరవిషయాలు మనసున ఉంచుకో(కూడ)దు అనుకున్నాడు.

ఒక్క సారి ఆగి ఆలోచించుదాం. మనకే ఇటువంటి అవకాశం వచ్చిందనుకోండి – ఏం కావాలో కోరుకో అంటే, ఏమని అడుగుతాం? మనం కూడా రావణ జాతి వారమే కనక ‘నేను చిరంజీవిని అయిపోవాలి, లేదా కొన్ని కోట్ల డబ్బులు కావాలి’ లేదా మరోటి కదా అడిగేది? ఉత్తర రామాయణంలో మునులు రాముడితో చెప్తారు రావణుడి తపస్సూ కోరున్న విషయాల సంగతి. చూడండి ఎంత దారుణంగా తపస్సు చేసాడో, తన తలలు నరుక్కుంటూ.

శ్లో: దశవర్ష సహస్రాణి నిరాహారో దశాననః
పూర్ణేవర్ష సహస్రేషు శిరశ్చాగ్నౌజుహావసః (సర్గ 10. శ్లో 10)

పదివేల ఏళ్ళు (దశవర్ష సహస్రాణి), వెయ్యేళ్ళకో (పూర్ణేవర్ష సహస్రేషు) శిరస్సు ఖండించి అగ్నిలో వేల్చుతూ (శిరశ్చాగ్నౌజుహావసః) చేసాట్ట. అదీ తిండీ తిప్పలూ మానేసి (నిరాహారో దశాననః). ఇదే రాక్షస గుణం అంటే. దాని వల్ల నాశనమే కలుగుతుంది కానీ బ్రహ్మ విద్య లభించడం అసంభవం. పోనీ ఇంత చేసినా బ్రహ్మ వచ్చి అడిగితే ఏమడిగాడు? “నాస్తి మృత్యుసమశ్శత్రుః అమరత్వమహం భజే” (మృత్యుకు సాటిలేని శత్రువు లేదు కనక నాకు అమరత్వం ఇప్పించు). బ్రహ్మ గారు అది కుదరదు మరోటి కోరుకో అంటే మానవులనుంచి తప్ప అపాయం రాకూడదు అన్నాడు. అయితే రావణుడితో పాటే విభీషణుడు కూడా చేసాడు తపస్సు. ఆయనకి బ్రహ్మ కనిపించినపుడు ఏమడిగాడు? నేను చేసిన తపస్సుకు సంతోషించి వరం ఇచ్చదల్చుకుంటే విను (ప్రీతేన యది దాతవ్యో వరమేశృణు సువ్రత)

శ్లో: పరమాపద్గరస్యాపి ధర్మే మమ మతిర్భవేత్
ఆశిక్షితంచ బ్రహ్మాస్త్రం భగవన్ ప్రతిభాతుమే (సర్గ 10. శ్లో 31)

ప్రాణాపాయమైన కష్టం వచ్చినా సరే నా మనస్సు ధర్మ మార్గంలోనే ఉండాలి. బ్రహ్మాస్త్రం వల్ల నాకు అపాయం కలగకూడదు. తాను బతకబోయేది పడగ నీడలో రావణుడితో కనక ఆ బ్రహ్మాస్త్రం సంగతి; రావణుడికి కోపం వస్తే బ్ర పనిచేయక ఎవరినైనా సరే చంపడానికి వెనకాడడు కనక అలా కోరాడు అనుకోవచ్చు. ఇది సత్వ గుణంతో చేసే తపస్సు. మోక్షసన్యాసం అనేది రానంతవరకూ మోక్షం అనేదే లేదు. ధర్మం తప్పకూడదని అడిగాడు కనక నువ్వు చిరంజీవిగా ఉంటావు అని అడక్కుండానే అమరత్వం ఇచ్చాడు బ్రహ్మ విభీషణుడికి. ఈ విషయం మనం బుద్ధుడి జీవితంలో, నచికేతుడి జీవితంలో (కఠోపనిషత్) కూడా చూడవచ్చు. యముడు ఎన్ని కోరికలు ఇస్తానన్నా అవన్నీ నీ దగ్గిరే ఉంచుకుని నాకు బ్రహ్మ విద్య ఒక్కటీ ఉపదేశించు చాలు అంటాడు నచికేతుడు.

ఇదే ఖట్వాంగుడు కూడా ఎంచుకున్న దారి. ఈయన వివేకం కలవాడు కనక ఇవన్నీ తనకూడా వచ్చేవి కాదు అని ఇలా ఆలోచించాడు.

మ. ఇలమీఁదన్ బ్రదుకేల? వేల్పులవరం బేలా? ధనం బేల? చం
చల గంధర్వపురీ విడంబనము లైశ్వర్యంబు లేలా? జగం
బులఁ బుట్టించు తలంపునం బ్రకృతితోఁ బొత్తై తుదిం బాసి ని
ర్మలమై వాఙ్మనసామితం బగు పరబ్రహ్మంబు నేఁ జెందెదన్. [9-255]

భూమ్మీద బ్రతుకు దేనికి, దేవతల వరాలు (వేల్పులవరం బేలా) దేనికి, డబ్బు దేనికి? చంచలమైన గంధర్వ పురం వంటి ఈ ఐశ్వర్యాలు దేనికి? జగాలని పుట్టించే తలంపుతో ముందు ప్రకృతితో పొత్తు పెట్టుకోవడం. తర్వాత విసుగెత్తి మనస్సు నిర్మలమవడం అయ్యాక మాటకి మనస్సుకీ (వాఙ్మన – వాక్కు, మనస్సు) అందని పరబ్రహ్మం జేరడం అనేది ఉంది కనక ముందు దాన్నే పొందడం మంచిది కదా? అలా ఆయన అన్నీ త్యజించాడు.

మ. కలసెన్ సంగములెల్లఁ బాసి నియతిన్ ఖట్వాంగు డశ్రాంతమై
కల దయ్యున్ మఱిమీఁద లే దనెడిదై కల్యాణమై యాత్మలోఁ
దలఁపం బల్కగరానిదై పరమమై తత్త్వజ్ఞు లూహించి హృ
జ్జలజాతంబుల వాసుదేవుఁ డని సంస్థాపించు నా బ్రహ్మమున్. [9-257]

అలా లౌకిక బంధాలు (సంగములెల్ల) తెంచుకుని, నిష్టతో (నియతిన్) ఏది తెలుసుకుంటే ఇంకేమీ తెలుసుకోనక్కర్లేదో, కళ్యాణాత్మకమైనదో, మాటల్లో వివరించలేనిదో, సర్వోన్నతమైనదో (మరిమీద లేదనిడిదై) తత్త్వజ్ఞులు హృదయంలో వాసుదేవుడని స్థాపించుకుంటారో అటువంటి బ్రహ్మాన్ని చేరుకున్నాడు.

వ. అట్టి ఖట్వాంగునకు దీర్ఘబాహుండు, దీర్ఘబాహునకు రఘువు, రఘువునకుఁ బృథుశ్రవుండుఁ, బృథుశ్రవునకు నజుండు, నజునకు దశరథుండును, పుట్టి; రా దశరథునకు సురప్రార్థితుండై పరబ్రహ్మమయుండైన హరి నాల్గువిధంబులై శ్రీరామ లక్ష్మణ భరత శత్రుఘ్న నామంబుల నిజాంశ సంభూతుండై జన్మించె; తచ్చరిత్రంబు వాల్మీకి ప్రముఖులైన మునులచేత వర్ణితంబైనది; యైననుం జెప్పెద సావధానమనస్కుండవై యాకర్ణింపుము. [9-258]

ఇప్పటికి ఈ సూర్యవంశం సాగి సాగి రాఘవుడి దగ్గిరకి వస్తోంది. ఈ ఖట్వాంగుడి తర్వాత దీర్ఘబాహుడు, రఘువు, పృథుశ్రవుడు, అజుడు, దశరధుడు పుట్టారు. దేవతల కోరిక మీద (సుర ప్రార్థితుండై) శ్రీహరి నాలుగు విధాలుగా పూర్తి అవతారంగా (నిజాంశ సంభూతుండై) వచ్చాడు – శ్రీరామ లక్ష్మణ భరత శత్రుఘ్నులనే పేర్లతో దశరధుడి కొడుకుల రూపంలో. సూర్యవంశం ఇక్కడ నుంచి రఘువంశం అనేపేరుతో కూడా సాగడానికి కారణం ఈ రఘు మహారాజే. రాముణ్ణి 'రఘువంశ సుధాంబుధి' అనడం కూడా ఈయన వల్లే. రఘువు తండ్రి పేరు గమనించారా? దీర్ఘబాహుడు. శరీరాకృతీ, వంశం క్రమక్రమంగా వృద్ధి చెందుతూ రాముడు ఆజానుబాహుడు అవడానికీ, ధర్మం తప్పని వాడవడానికీ కారణాలు కనబడుతున్నాయి. సంస్కృతంలో 'ర' అంటే కాంతి, 'ఘ' అంటే కదిలేది అని అర్థంట. రఘువు అంటే ఎక్కువ వేగం కల, సూర్యుడు, ప్రయాణించే కాంతి అనీ అర్థాలు.

ఈ రఘువు గురించి చిన్నకథ చెప్పుకుని ముందుకెళ్దాం. ఈ కథ ఎందుకంటే ధర్మం వృద్ధి చెందుతోంది సూర్యవంశంలో అని ఉదహరించడానికే. అనేక గురుకులాలు స్థాపించాడుట రఘుమహారాజు. ఓ గురుకులంలో నిరుపేద అయిన కౌత్సుడు అనే ఓ శిష్యుడు విద్య పూర్తయ్యాక గురు దక్షిణ ఏం కావాలో అడగండి అన్నాడు. గురువుకి ఈ కుర్రాడి సంగతి తెల్సి ఏమీ వద్దులే అన్నాడు. అబ్బే అలాక్కాదు, ఏదో ఒకటి కోరుకోండి అనేసరికి 'మనిషి రాయి పైకి విసిరితే ఎంత పైకి వెళ్తుందో అంత ఎత్తున ధనం ఇయ్యి' అన్నాడు. తన దగ్గిర చిల్లిగవ్వ లేదు, దీన్ని తీర్చగలవాడు రఘువు ఒక్కడే అనుకుని ఆయన అడగడానికి వచ్చేసరికి రఘువు అప్పుడే ఏదో యజ్ఞం చేసి తనకు ఉన్న వన్నీ దానం చేసేసి చెవులకి మట్టి కుండలాలు పెట్టుకుని ఉన్నాట్ట. రఘువుని ఈ స్థితిలో ఏం అడగాలో తెలియక కౌత్సుడు వెనక్కి వెళ్ళిపోతూంటే ఆయన

పిల్చాడు, “ఏం అడక్కుండా ఎందుకు వెళ్ళిపోతున్నారని.’ ఈయన తన కథ చెప్పాక సంగతి అంతా విని, ‘రేప్పొద్దున్న వచ్చి ధనం తీసుకెళ్ళు అన్నాట్ట’ రఘువు.

తర్వాత వశిష్టుణ్ణి అడిగాడు ఇరవై నాలుగ్గంటల్లో ఇది తేలేది ఎలా? సమయం లేదు కనక ఇంద్రుడిపై దండయాత్ర చేయి ఆయన నీ కోశాగారం నింపుతాడు అని చెప్పాడు వశిష్టుడు. ఈ రఘు మహారాజు పరాక్రమం, ధర్మ నిరతీ తెల్సినవాడు కావడం వల్ల యుద్ధం జరగడానికి ముందే కోసాగారం నింపాడుట ఇంద్రుడు. యుద్ధం మానేసి మర్నాడు కౌత్సుడికి డబ్బులన్నీ ఇచ్చాడు. అయినా కోశాగారంలో ఇంకా డబ్బు మిగిలింది. ఇది రఘువుది కాదు కదా? ఆరా తీస్తే ఇది ఇంద్రుడిది అని తెల్సింది. మిగిలిన ఈ డబ్బు అంతా ఇంద్రుడికి వెనక్కి ఇచ్చేసాట్ట రఘువు. అది కదా ధర్మ నిరతి అంటే; అదీ తన దగ్గిర ఉన్నదంతా దానం చేసాక. ఉన్నప్పుడు ఇవ్వడం కాదు కానీ ఏ పరిస్థితులలోనైనా ఇవ్వగలగడం కష్టం కదా? ఇచ్చాక మిగిలినది తనది కాదని వదుల్చుకోవడం కూడా కనాకష్టం.

ఇక్కడనుంచి రామకథ చెప్తున్నాడు శుకమహర్షి. ఇదంతా వాల్మీకి వంటివారు వివరంగా రాసారు అయినా స్థూలంగా చెప్తాను విను అని పరీక్షిత్తుతో అంటూ. ఇక్కడనుంచి యాభై నుంచి వంద లోపు పద్యాలతో రామావతారం కథ చెప్పేస్తాడు పోతన. పుట్టిన రాముడు ఎలా పుట్టాడు?

మ. అమరేంద్రాశకుఁ బూర్ణచంద్రుఁ డుదితుండై నట్లు నారాయణాం
శమునం బుట్టె మదాంధ రావణశిరస్సంఘాతసంఛేదన
క్రమణోద్దాముఁడు రాముఁడా గరితకుం గౌసల్యకున్ సన్నుతా
సమనైర్మల్య కతుల్య కంచితజనుస్సంసారసాఫల్యకున్. [9-259]

తూర్పు దిక్కున (అమరేంద్రాశకు; ఇంద్రుడికి దిక్కు, తూర్పు) చంద్రుడు ఉదయించినట్టూ రావణుడి తలలు నరకడానికి నారాయణుడు పరిశుద్ధురాలైన సాధ్వి, పతివ్రత అయిన కౌసల్య కడుపున పుట్టాడు. ఈ పద్యంలో పతివ్రత అనేది ఎక్కడుందో చెప్పండి చూద్దాం. గరిత – పతివ్రత.

మ. సవరక్షార్థము దండ్రి పంపఁ జని విశ్వామిత్రుఁడుం దోడరా
నవలీలం దునుమాడె రాముఁ డదయుండై బాలుఁడై కుంతల

చ్ఛవిసంపజ్జితహాటకం గపటభాషావిస్ఫురన్నాటకన్
జవభిన్నార్యమఘోటకం గరవిరాజత్ఖేటకం దాటకన్. [9-260]

విశ్వామిత్రుడి యజ్ఞం (సవః) రక్షించడానికి తండ్రి పంపితే బాలుడైన రాముడు తాటకి రాక్షసి కనక ఆడది అనే దయ అనేది కూడా చూపించకుండా (అదయుండై), కపట మాయావేషాలు, నాటకాలు వేసేదాన్ని (కపటభాషావిస్ఫురన్నాటకన్), సూర్యుడి గుర్రాలకంటే వేగం కలదాన్ని (జవభిన్నార్యమఘోటకం; జవ-వేగం, భిన్-ఓడించే, ఆర్య-సూర్యుడు, ఘోటకం-గుర్రాలు). చేతిలో మంచి డాలు ఉండేదాన్నీ (కరవిరాజత్ఖేటకం; కర-చేతిలో, విరాజ-ప్రకాశించే, ఖేటకం-డాలు) అయిన తాటకిని సంహరించాడు.

పోతన ద్రాక్షాపాకం రాస్తాడనేది ఎంత నిజమో, ఎప్పుడైనా నారికేళాపాకం రాయడానిక్కూడా వెనుకాడాడని ఈ పద్యం చెప్తుంది. ఇందులో మూడు నాలుగు పదాలు నిఘంటువు చూస్తే కానీ అర్ధం కావు. భాగవతం విష్ణువు కథలన్నీ చెప్పే కావ్యం కనక వాల్మీకి చెప్పినంత విశదంగా ఉండదు పోతన చెప్పే రామ కథ. అయితే రామాయణం ఎన్నిసార్లు విన్నా మరోసారి వినడానికి విసుగు పుట్టదని అనడం తెల్సినదే. బాపు, ముళ్ళపూడి గారి సంపూర్ణ రామాయణం సినిమాలో అంటారు చివరి పద్యంలో – రామనామము భవస్తోమభంజన దివ్యతారకనామై తనరు గాత.... కవులెల్ల నీ దివ్యకథ నెల్లరీతుల కొనియాడి ముక్తి గైకొంద్రు గాత....” అలాగే భాగవతం రాయమని తనతో చెప్పాక పోతనలో కవి ‘నల్లనివాడు పద్మ నయనంబులవాడు...’ అనే ద్రాక్షాపాకం వంటి పద్యాలతో ఈ రామకథలో రాముణ్ణి ఆకాశానికి ఎత్తినప్పుడు వళ్ళు జలదరిస్తుంది మనకి అవి చదువుతూంటే. అవి వచ్చే వ్యాసాలలో గమనిద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS